క్లుప్తంగా

ప్రదోషకాల పూజలు నేడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కం డ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ మంగళవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎమ్మార్సీకి ఇన్వర్టర్ వితరణ



దిలీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంఈఓలు

కార్వేటినగరం: మండల విద్యాశాఖ కార్యాలయానికి శ్రీలక్ష్మీ నరసింహ విద్యాసంస్థ ఆధ్వర్యంలో కరస్పాండెంట్ దిలీప్‌కుమార్ మంగళవారం ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్‌కు ఇన్వర్టర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయానికి ఇన్వర్టర్ అందించడం అభినందనీయమని కొనియాడారు. శ్రీలక్ష్మీ నరసింహ విద్యాసంస్థలు మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా ఎంఈఓలు శ్రీలక్ష్మీనరసింహ విద్యాసంస్థను కరస్పాండెంట్‌ను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తం



కోళ్లఫారంలో తనిఖీ చేస్తున్న పశుసంవర్థక శాఖ ఏడీ రూపాసుందరి

శ్రీరంగరాజపురం : కోళ్లకు సంక్రమిస్తున్న బర్డ్ ఫ్లూపై ప్రజలు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ ఏడీ రూపాసుందరి అన్నారు. తయ్యూరు పశుసంవర్థక వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఇటీవల కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. ఈ క్రమంలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం మర్రిపల్లికి చెందిన కుమార్ కోళ్లఫారంను తనిఖీ చేశారు. ఎక్కడైనా ఎక్కువ సంఖ్యలో కోళ్లు మరణిస్తే వెంటనే సమీప పశువైద్యాధికారికి తెలియజేయాలని కోళ్లఫారం యాజమానికి సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీవిద్య, ధర్మారావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

నగరి : నియోజకవర్గంలో చేపట్టే పలు కార్యక్రమాల్లో బుధవారం మంత్రి ఆర్‌కే రోజా పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు సత్రవాడలో శ్రీ పాంచాలమ్మ సమేత పాండవాలయ కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మండలంలోని వీకేఆర్ పురంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌లను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పుత్తూరు మున్సిపాలిటీలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను కూడా ప్రారంభిస్తారు.

26న బహిరంగ వేలం

నగరి : మున్సిపల్ ఆర్థిక వనరులైన నగరి, సత్రవాడ వారపుసంత, దినసరి మార్కెట్, బస్టాండు, ట్యాక్సీ ఆటోలు, జంతువధ శాలను గుత్తహక్కులపై కేటాయించడానికి వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన వేలం జరుగుతుందని, ఆసక్తిదారులు పాల్గొనవచ్చని చెప్పారు.

బాలాజీ పురోహిత్‌కు పరామర్శ



బాలాజీకి పండ్లు అందజేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: పట్టణానికి చెందిన బాలాజీ పురోహిత్‌ను పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా మంగళవారం ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలాజీ ఆరోగ్య పరిస్థితిని ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, కౌన్సిలర్లు ఏకాంబరం, రాధ, నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోంది. ప్రజారోగ్యానికి అవసరమైన మేరకు ఆస్పత్రులను, వైద్యసిబ్బందిని ఏర్పాటు చేస్తోంది. బడ్జెట్‌లో కూడా ప్రత్యేక నిధులను కేటాయించింది. ముఖ్యంగా కరోనా లాంటి విపత్తు సమయంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే లక్షలమంది ప్రాణాలతో బయట పడ్డారు. అప్పటివరకు ప్రభుత్వ వైద్యం అంటే ప్రజల్లో ఉన్న చులకన భావాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసా కల్పించింది. అందుకు అనుగుణంగా పట్టణాల్లో అర్బన్ హెల్త్‌సెంటర్లు, పల్లెల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ద్వారా వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

- రూ.1.60 కోట్లతో రెండు అర్బన్ హెల్త్‌సెంటర్లు మంజూరు
- కరోనా విపత్తు తరువాత మరింత విస్తృతంగా ప్రభుత్వ వైద్యసేవలు
- ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- నేడు ప్రారంభించనున్న మంత్రి ఆర్‌కే రోజా



పుత్తూరులో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గోవిందపాళెం అర్బన్ హెల్త్‌సెంటర్

పుత్తూరు: నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం పట్ల మంత్రి ఆర్‌కే రోజా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పుత్తూరు పట్టణ ప్రజల అవసరాల దృష్ట్యా రెండు అర్బన్ హెల్త్‌సెంటర్లను మంజూరు చేయించారు. అందులో నిర్మాణం పూర్తి చేసుకున్న పుత్తూరు పట్టణంలోని గోవిందపాళెం వద్ద నిర్మించిన ఒక అర్బన్ హెల్త్‌సెంటర్‌ను మంత్రి ఆర్‌కే రోజా బుధవారం ప్రారంభించనున్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వంలో 108, ఆరోగ్యశ్రీ పథకాలు ప్రజలకు వరప్రదాయినిలా నిలిచాయి. నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయాలకు అనుగుణంగా ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. 108 వాహన సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు, ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తృతం చేయడంతో పాటు రూ.5 లక్షల పరిమితి నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ పేదల ఆరోగ్యం పట్ల మరింత కల్పించారు. గతంలో 1059 జబ్బులకు వైద్య సేవలందించగా, నేడు ఆ సంఖ్యను 3257గా పెంచి పేద ప్రజలను ఆదుకుంటున్నారు. అదేరీతిలో పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం అర్బన్ హెల్త్‌సెంటర్లను తీసుకొచ్చారు. శాశ్వత భవనాల కోసం ప్రత్యేకంగా నిధులను మంజూరు చేశారు. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌ను రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసి, పట్టణ ప్రజలకు సైతం మెరుగైన వైద్యసేవలకు శ్రీకారం చుట్టారు. పుత్తూరు పట్టణ పరిధిలో రూ.1.60 కోట్లతో కల్యాణపురం, గోవిందపాళెం వద్ద రెండు నిర్మాణాలు పూర్తయ్యాయి. గోవిందపాళెం సెంటర్ పరిధిలోకి 7 సచివాలయాలు, కల్యాణపురం సెంటర్ పరిధిలోకి 6 సచివాలయాలు కేటాయించారు. ప్రతి అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక డేటా ఆపరేటర్, ఒక అటెండర్ అందుబాటులో ఉంటారు. ఈ అర్బన్ హెల్త్‌సెంటర్లలో అన్నిరకాల వైద్యసేవలతో పాటు పిల్లలకు అన్నిరకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉంటాయి. ఈ కేంద్రాలు ప్రారంభమైతే పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.



అర్బన్ హెల్త్‌సెంటర్ లోపలి భాగం

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం..



పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా అర్బన్ హెల్త్‌సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయి. పుత్తూరు పట్టణంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పీహెచ్‌సీలు ఉన్నా అదనంగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు కావడంతో ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం పుత్తూరు పట్టణ జనాభా 54 వేలు, నేడు 60 వేలు ఉంటుందని అంచనా. వీరందరికీ మెరుగైన వైద్య సేవల పట్ల ధీమా ఏర్పడినట్లే. – కె.ఎల్.ఎస్.రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

ప్రజా అవసరాలను గుర్తించి..



కరోనా సమయంలో అవసరాల మేరకు ఆస్పత్రులు అందుబాటులో లేకపోవడంతో పలువురు పేదలు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆస్పత్రుల అవసరాలను గుర్తించిన రాష్ట్రప్రభుత్వం పట్టణ ఆస్పత్రుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే అర్బన్ హెల్త్‌సెంటర్లను నిర్మించడం జరిగింది. జనాభాకు అనుగుణంగా వైద్యసేవలు నిత్యం అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. – టి.చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ, పుత్తూరు మున్సిపాలిటీ

సామాజిక న్యాయమే లక్ష్యం



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది లక్ష్మీపతి

పుత్తూరు: సామాజిక న్యాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని సీనియర్ న్యాయవాది లక్ష్మీపతి అన్నారు. స్థానిక సీనియర్ సివిల్‌జడ్జి రాఘవేంద్ర ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక కాపువీధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, ధనిక అన్న వివక్ష లేకుండా చట్టపరంగా ప్రజలందరికీ సమాన న్యాయం జరగాలని ఐక్యరాజ్య సమితి ఇచ్చిన పిలుపు రోజును ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ బడుగు, బలహీన వర్గాలకు, ప్రకృతి వైపరీత్యాలకు గురైన వారికి, స్త్రీలకు, పిల్లలకు, మతిస్థిమితం లేనివారికి, ఆర్థికంగా వెనకబడిన వారికి, షెడ్యూల్డ్ కులాల వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనపై శిక్షణ



డిజిటల్ బోధనపై శిక్షణ ఇస్తున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అనువుగా డిజిటల్ బోధన చేయాలని ఎంఈఓ గిరిజ తెలిపారు. పాలసముద్రం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాజు, మీనాక్షి రిసోర్స్‌పర్సన్ ఆధ్వర్యంలో డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గిరిజ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు దీటుగా డిజిటల్ బోధన చేయాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసిందన్నారు. అందువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన విద్యార్థులకు బోధించే విధానంపై వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ కోదండయ్య, ఆనందయ్య, సిల్వం, వేణుగోపాల్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన



మాట్లాడుతున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండలంలోని తిరుమలరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించిందని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సర్పంచ్ జీవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 285 మందికి వైద్య సేవలందించారు. 45 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో పదిమందికి శస్త్ర చికిత్సలు, 15 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. వైద్యాధికారి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం మండలంలో ముగిసిందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌ఓ, ఆశా పాల్గొన్నారు.



కంటిఅద్దాలు అందిస్తున్న సర్పంచ్, డాక్టర్

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంటలో మంగళవారం ఈఓపీఆర్డీ పురుషోత్తం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డితో కలిసి రోగులకు మెడికల్ కిట్లు అందజేశారు. వైద్యాధికారి ప్రవీణ, సర్పంచ్ భువనేశ్వరి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, జేసీఎస్ కన్వీనర్ సుబ్రమణ్యం, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



అత్తూరులో ఆరోగ్య సురక్ష కిట్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ దీప

పేదలకు రక్షణగా ఆరోగ్య సురక్ష

నింద్ర: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు రక్షణగా నిలుస్తోందని ఎంపీపీ దీప అన్నారు. మంగళవారం అత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేదలకు పూర్తిస్థాయిలో ఉచితంగా వైద్యసేవలు అందించడానికే ప్రభుత్వం ఈ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అనంతరం 356 మంది శిబిరంలో పాల్గొనగా, డాక్టర్లు వివిధ పరీక్షలు చేసి, వారికి అవసరమైన మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ భవానీ, సర్పంచ్ మలర్, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.



వెదురుకుప్పంలో..

ఉపాధి కూలీ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం బబిత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్

విజయపురం: మండలంలోని కాళికాపురం దళితవాడకు చెందిన ఉపాధి కూలీ రాజిమునెమ్మ (60) మంగళవారం మృతి చెందింది. వివరాలు.. మంగళవారం ఉపాధి కూలీలు స్థానిక సచివాలయ సమీపంలో సప్లై చానల్ పనులు చేస్తుండగా రాజిమునెమ్మ సొమ్మసిల్లి కింద పడిపోయింది. వెంటనే తోటి కూలీలు పక్కనే ఉన్న చెట్టు కిందకు ఆమెను తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందిస్తుండగానే ఆమె మృతి చెందినట్లు చెప్పారు. వెంటనే అధికారులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి ఏపీఎం బబిత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వీఆర్వో వివేక్, మహిళ పోలీసులు చేరుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

పాలసముద్రం : వరి, వేరుశనగ పంటలను ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. మంగళవారం ఏట్టుకూరిపల్లెలో క్షేత్రస్థాయి వ్యవసాయ పొలాల సందర్శనలో భాగంగా వరి, వేరుశనగ సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సాగు సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వైద్యురాలు బదిలీ

నగరి : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవించిన గుండ్రాజుకుప్పం దళితవాడకు చెందిన వన్మతి అనే మహిళ పలు ఆరోగ్య సమస్యలు ఎదురుకావడంతో ఆస్పత్రి వద్ద గ్రామస్తులతో వచ్చి నిరసన వ్యక్తం చేయడం దీనిపై మంత్రి ఆర్కేరోజా ఆదేశాల మేరకు వైద్యురాలిపై ఎంక్వైరీ వేయడం విదితమే. ఆరోపణలు ఎదుర్కొన్న వైద్యురాలిని నెల్లూరు జిల్లా ఆత్మకూరు జిల్లా ఆస్పత్రికి బదిలీ చేసినట్లు ప్రభుత్వ కార్యదర్శి నుంచి ఆస్పత్రికి ఉత్తర్వులు అందాయి.

వలంటీర్లే జగనన్న సైన్యం



వలంటీర్లను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను సీఎంను చేసుకుందాం
- వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి



వలంటీర్ల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ సీఎం

శ్రీరంగరాజపురం : వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని, వారే జగనన్న సైన్యం అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలకేంద్రం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవవజ్ర, సేవరత్న, సేవమిత్ర అవార్డులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ వలంటీర్ల వ్యవస్థతో అవినీతికి తావులేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నట్లు చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధిలా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థను దేశంలోని మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించాలని వలంటీర్లకు సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం వలంటీర్ల చేత రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ హరిత, మండల కన్వీనర్ మణి, నాయకులు కుప్పయ్య, విజయాబాబు, కాలప్ప, ఎంపీడీఓ మురళి, తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటు



మాట్లాడుతున్న కమిషనర్ కెఎల్ఎస్‌రెడ్డి

పుత్తూరు: పట్టణ పరిధిలో త్వరలో జగనన్న మహిళా మార్టు (జేఎంఎం) ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ కెఎల్ఎస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జేఎంఎం సూపర్ మార్కెట్ ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. ప్రజలకు సరసమైన ధరలకు, అన్ని రకాల వస్తువులు ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం జేఎంఎం ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం మంత్రి రోజా చేతుల మీదుగా రూ.80 లక్షలతో ఏర్పాటు చేసిన గోవిందపాళెం అర్బన్ హెల్త్‌సెంటర్ తుది దశ పనులను పర్యవేక్షించారు. 18, 19 వార్డు కౌన్సిలర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించి, వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే శ్మశాన వాటిలో శివుని విగ్రహ ప్రతిష్ట ఏర్పాట్లను పరిశీలించారు.

సుదర్శనరాజుకు ఘన సన్మానం



పదవీ విరమణ పొందిన టీచర్ సుదర్శన్‌రాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు సుదర్శన్‌రాజును మంగళవారం పలు మండలాల్లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి హేమారెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగడం ఎంతో గొప్ప అని కొనియాడారు. ఎందరో విద్యార్థుల జీవితాలను ఉన్నత స్థానానికి చేర్చిన సుదర్శన్‌రాజు ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడని అన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సుదర్శన్‌రాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, చలపతిరావు, వేణుగోపాల్, భీమారావు, శ్రీనివాసులు పలువురు సాంఘికశాస్త్రం ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గజ వాహనంపై సుబ్రమణ్యేశ్వరస్వామి దర్శనం



గజవాహనంపై భక్తులను కటాక్షిస్తున్న సుబ్రమణ్యేశ్వరస్వామి

పుత్తూరు: పట్టణంలో వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు గజవాహనంపై ఊరేగారు. ఉదయం గణపతి పూజ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు గజవాహనం అధిరోహించి పట్టణ పురవీధుల్లో ఊరేగారు. మంగళ వాయిద్యాలు, బాణసంచా నడుమ దర్శనమిస్తున్న స్వామివారికి భక్తులు ఇంటింటా కర్పూర హారతులిచ్చారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

గంగాధరనెల్లూరు: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఆర్‌ఓ వెంకటశివ అన్నారు. నియోజకవర్గ ఎన్నికల అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్మికులు

పుత్తూరు: భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని ఏఐటీయూసీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవన కార్మికుల పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. పనిలో ప్రమాదవశాత్తు మరణించిన, వికలత్వం పొందిన కార్మికులకు నష్ట పరిహారం పెంచాలని కోరారు. షెల్టర్లు నిర్మించి కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, వారి పిల్లలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.